## క్లుప్తంగా

### హరిహర క్షేత్రంలో పూజలు



శ్రీరాముడిని దర్శించుకుంటున్న బెహరా భాస్కరరావు

గోపాలపట్నం: జీవీఎంసీ 92వ వార్డు పద్మనాభనగర్ సీతారామ సహిత విశాలాక్షి, విశ్వేశ్వర విజయగణపతి ఆలయం(హరిహర క్షేత్రం)లో శ్రీరాముడిని శనివారం జీవీఎంసీ కో ఆప్షన్ సభ్యుడు బెహరా భాస్కరరావు దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ అర్చకులు, కమిటీ సభ్యులు ఆయనకు స్వామివారి శేషవస్త్రాలు, తీర్థప్రసాదాలు అందించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ 91, 92 వార్డుల అధ్యక్షులు గుణిశెట్టి శ్రీనివాసరావు, అప్పలస్వామి నాయుడు, జేసీఎస్ క్లస్టర్ ఇన్‌చార్జి గేదెల మురళీకృష్ణ, కపర సత్తిబాబు, సాలాపు మారయ్య, ఎస్.శ్రీను, కె.హరి, భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

### బహిరంగ ప్రదేశాల్లో చెత్త వేయొద్దు



చెట్టుకు ఏర్పాటు చేసిన చెత్త డబ్బా, మైక్ సెట్

గోపాలపట్నం: మన చెత్త బాధ్యత మనదేనంటూ గోపాలపట్నం జేడీ ఫౌండేషన్ సభ్యులు ప్రజల్లో అవగాహన కల్పించే కార్యక్రమం చేపట్టారు. జీవీఎంసీ 91వ వార్డు గోపాలపట్నం శ్రీరామ్‌నగర్ వద్ద రైల్వే స్థలాల్లో విచ్చలవిడిగా చెత్తలు వేస్తుండటంతో దారుణంగా తయారవుతోంది. దీన్ని దృష్టిలో ఉంచుకుని జేడీ ఫౌండేషన్ సభ్యులు ఒక చెత్త డబ్బాను చెట్టుకు ఏర్పాటు చేశారు. దీనిపై రికార్డింగ్ మైక్‌ను ఉంచారు. దీని ద్వారా మీ ఇంటి చెత్తను జీవీఎంసీ సిబ్బందికి ఇవ్వాలని, బహిరంగ ప్రదేశాల్లో వేయరాదని ప్రచారం చేస్తున్నారు. ఇది అందరూ బాధ్యతగా స్వీకరించి, పర్యావరణాన్ని కాపాడాలని కోరుతున్నారు.

### రేపటి నుంచి జీవీఎంసీ షెల్టర్‌లో ఆధార్ క్యాంప్

విశాఖ విద్య: జీవీఎంసీ 90వ వార్డు బుచ్చిరాజుపాలెం జీవీఎంసీ షెల్టర్‌లో ఈ నెల 12 నుంచి 16 వరకు ఆధార్ క్యాంప్ నిర్వహిస్తున్నట్లు మమత చారిటబుల్ ట్రస్టు ఫౌండర్ ఎల్లేటి మమత ఒక ప్రకటనలో తెలిపారు. జీవీఎంసీ షెల్టర్‌లో నిరాశ్రయులందరికీ ఆధార్ ఎన్‌రోల్మెంట్ కల్పించేందుకు క్యాంప్ ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. నిరాశ్రయులతోపాటు ఇతరులు కూడా ఆధార్ కార్డు నమోదు, చేర్పులు, మార్పులు చేసుకోవచ్చన్నారు. బుచ్చిరాజుపాలెం పరిసర కాలనీ వాసుల సౌకర్యార్థం జీవీఎంసీ అధికారుల సహకారంతో దీనిని ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని ప్రతీ ఒక్కరూ వినియోగించుకోవాలని మమత కోరారు.

### చెకుముకి సంబరాలకు మల్కాపురం విద్యార్థులు



చెకుముకి సంబరాలకు వెళ్తున్న మల్కాపురం జీవీఎంసీ హైస్కూల్ విద్యార్థులు

మల్కాపురం: ఈ నెల 10, 11 తేదీల్లో గుంటూరు జిల్లా ఎడ్లపాడు వద్ద జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయి చెకుముకి సైన్స్ సంబరాలు నిర్వహిస్తున్నారు. రాష్ట్రంలోని 26 జిల్లాల నుంచి వివిధ పాఠశాలల విద్యార్థులు రెండు టీమ్‌లుగా పాల్గొన్నారు. విశాఖ నగరం నుంచి ఓ ప్రైవేట్ స్కూల్, జీవీఎంసీ పాఠశాల నుంచి రెండు టీమ్‌లుగా తరలి వెళ్లారు. దీనిలో భాగంగా మల్కాపురం జీవీఎంసీ ఉన్నత పాఠశాల నుంచి 8, 9, 10 తరగతుల విద్యార్థులు ఎ.జశ్వంత్‌కుమార్, వి.హేమంత్ కుమార్, బి.యోష్మ చెకుముకి పోటీల్లో పాల్గొంటున్నారు.



# అద్దంలా రహదారులు



గొందేశివానిపాలెంలో నిర్మించిన బీటీ రోడ్డు

- 58వ వార్డులో బీటీ, సీసీ రోడ్ల నిర్మాణం
- రెండేళ్లలో కోటి రూపాయలతో ఆధునికీకరణ
- అభివృద్ధి పనులపై స్థానికుల హర్షం




మల్కాపురం: జీవీఎంసీ 58వ వార్డులోని రహదారులకు మోక్షం లభించింది. రెండేళ్ల ముందు ఈ వార్డులోని పలు ప్రాంతాల్లో గల బీటీ, సీసీ రోడ్లు రాళ్లు తేలి, గోతులు ఏర్పడి శిథిలావస్థలో ఉండేవి. నేడు అవి అద్దంలా దర్శనమిస్తున్నాయి. ఆయా ప్రాంతాల్లో నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ పశ్చిమ నియోజకవర్గ సమన్వయకర్త ఆడారి ఆనంద్ కుమార్ దృష్టికి స్థానికులు రహదారుల సమస్యలను తీసుకెళ్లి పరిష్కార మార్గం చూపాలని కోరారు. మరసటి నెలలోనే ఆయా ప్రాంతాల్లో కోట్ల రూపాయల నిధులతో బీటీ, సీసీ రోడ్లను ఆధునికీకరించారు. అభివృద్ధి పనులపై స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.

**'ఆడారి' కృషితో పరిష్కారం..**

వార్డులోని గొందేశివానిపాలెం, ములగాడ విలేజ్, చిన్న ములగాడ, ఏదురవానిపాలెం, పిలకవానిపాలెం, శ్రీహరిపురం, గుల్లలపాలెం తదితర ప్రాంతాల్లో గల బీటీ, సీసీ రోడ్లు పిక్క తేలి ఉండటంతో రాకపోకలు సాగించేందుకు ప్రజలు ఇబ్బంది పడేవారు. గతేడాది నవంబర్‌లో ఆయా ప్రాంతాల్లో చేపట్టిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాల్లో పాల్గొన్న ఆడారి ఆనంద్‌కుమార్‌కు స్థానికులు ఈ సమస్యను తెలియజేశారు. ఆయన వెంటనే జీవీఎంసీ మేయర్, కమిషనర్‌లతో మాట్లాడి ఆయా ప్రాంతాల్లో బీటీ, సీసీ రోడ్ల నిర్మాణానికి కృషి చేశారు. సమస్య పరిష్కారమవడంతో ఆయా ప్రాంతాలవాసులు ఆడారి ఆనంద్‌కుమార్‌కు కృతజ్ఞతలు తెలియజేశారు.

### నిధులు.. కొత్త రోడ్లు నిర్మించిన ప్రాంతాలు

- గొందేశివానిపాలెంలో రూ.25 లక్షలతో బీటీ రోడ్డు నిర్మాణం.
- ఏదురవానిపాలెంలో రూ.80 లక్షలతో బీటీ రోడ్డు నిర్మాణం.
- పిలకవానిపాలెం నుంచి ములగాడకు వెళ్లే మార్గంలో రూ.20 లక్షలతో బీటీ రోడ్డు నిర్మాణం.
- శ్రీనివాస్‌నగర్, రామ్‌నగర్ ప్రాంతాల్లో రూ.75 లక్షలతో సీసీ రోడ్డు నిర్మాణం.
- ఉప్పర కాలనీ, ములగాడ విలేజ్ ఏరియాల్లో రూ.52 లక్షలతో సీసీ రోడ్డు నిర్మాణం.



ఏదురవానిపాలెంలో వేసిన సీసీ రోడ్డు



పిలకవానిపాలెం - ములగాడ మార్గంలో నిర్మించిన బీటీ రోడ్డు

### అభివృద్ధే ధ్యేయం



అన్ని ప్రాంతాల అభివృద్ధే ధ్యేయంగా కృషి చేస్తున్నాం. 58వ వార్డులో గతంలో ఎన్నడూ లేని విధంగా కోట్ల రూపాయలతో బీటీ, సీసీ రోడ్లు నిర్మింప జేశాం. ఆయా ప్రాంతాల్లో పర్యటించి స్థానికుల సమస్యలు తెలుసుకున్నాం. అధికారులతో మాట్లాడి మూడు నెలల వ్యవధిలోనే రహదాల నిర్మాణానికి చర్యలు చేపట్టాం.
– ఆడారి ఆనంద్‌కుమార్, వైఎస్సార్‌సీపీ పశ్చిమ సమన్వయకర్త

### సీసీ రోడ్డుకు మోక్షం



మా ప్రాంతంలోని రహదారి రాకపోకలు సాగించడానికి వీలు లేకుండా ఉండేది. ఆడారి ఆనంద్‌కుమార్ కృషితో ఏదురవానిపాలెంలో సీసీ రోడ్డుకు మోక్షం లభించింది. ఇక్కడ నిర్మించిన రోడ్డు ఎంతో సౌకర్యంగా ఉంది.
– తోనంగి వెంకటరమణి, ఏదురవానిపాలెం

### రెండు నెలల్లోనే సమస్య పరిష్కారం



మా ప్రాంతంలో బీటీ రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలని గత పాలకులకు పలు మార్లు గ్రామ కమిటీ నుంచి వినతిపత్రాలు అందించాం. ఎటువంటి ఫలితం లేదు. ఆడారి ఆనంద్‌కుమార్ దృష్టికి ఈ సమస్యను తీసుకెళ్లిన రెండు నెలల వ్యవధిలోనే సీసీ రోడ్డు వేయించారు. ఆయనకు మా విలేజ్ తరఫున కృతజ్ఞతలు.
– పెద్దాడ వెంకటరమణ, ములగాడ విలేజ్

### మునుపెన్నడూ లేని అభివృద్ధి



మా వార్డులోని వివిధ ప్రాంతాల్లో బీటీ, సీసీ, రోడ్లు, సామాజిక భవనాలు, ఓపెన్ జిమ్‌లు, శ్మశానవాటికల అభివృద్ధి చూస్తే ముచ్చటేస్తోంది. గతంలో ఎన్నడూ లేని అభివృద్ధి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ పాలనలో నేడు జరిగింది.
– సిహెచ్.వినయ్‌యాదవ్, శ్రీహరిపురం

## పార్కుల నిర్వహణలో భాగస్వాములు కండి



మాట్లాడుతున్న కొలుసు నాగేశ్వరరావు

విశాఖ విద్య: ప్రజల కోసం జీవీఎంసీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేస్తున్న పార్కులు, గ్రీన్‌బెల్ట్‌లు అందరికీ ఉపయోగకంగా ఉండేలా ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలిన హెల్దీ వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు కొలుసు నాగేశ్వరరావు పిలుపునిచ్చారు. మద్రిపాలెం గ్రీన్‌బెల్ట్ పార్కులో శనివారం వాకర్స్ అసోసియేషన్ నెలవారీ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మద్రిపాలెం వుడా లేఅవుట్ కాలనీ వాసులకు ఎంతో ఉపయోగకరంగా ఉండేలా పార్కులు అభివృద్ధి చేస్తుండటం సంతోషించదగ్గ విషయమన్నారు. పచ్చదనం పెంపుతోనే ఆరోగ్యకరమైన వాతావరణం కాలనీ వాసులకు అందించేలా డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్ ఎంతో శ్రద్ధ తీసుకొని పార్కులను అభివృద్ధి చేస్తున్నందున వాకర్స్ అసోసియేషన్ తరఫున కృతజ్ఞతలు తెలిపారు. గ్రీన్ బెల్ట్ పార్కులో వాకర్స్ కోసమని ప్రత్యేకంగా స్కేటింగ్, షటిల్ ఆడేందుకు కోర్టు ఏర్పాటు చేయటం అభినందనీయమన్నారు. సమావేశంలో ఈటి సత్యనారాయణ, జాకబ్, లక్ష్మణరావు, విజయ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## నేడు ఎరుకుమాంబ అమ్మవారి విగ్రహం ఊరేగింపు

సీతమ్మధార : దొండపర్తిలో వెలసిన ఎరుకుమాంబ అమ్మవారి ఉత్సవ విగ్రహం ఆదివారం ఉదయం ఊరేగించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. అల్లిపురంలో తయారు చేసిన అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని ఊరేగింపుగా దొండపర్తిలోని ఆలయానికి తీసుకొస్తామన్నారు. 17వ తేదీన అమ్మవారికి క్షీరాభిషేకం, జలాభిషేకం నిర్వహించి 18వ తేదీ ఉదయం ప్రాణ ప్రతిష్ఠ చేస్తారని తెలిపారు.

## యువతకు ఉపాధి కల్పతరువు స్టీల్‌ప్లాంట్



దీక్షలో పాల్గొన్న అగనంపూడి సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ సభ్యులు

కూర్మన్నపాలెం: విశాఖ స్టీల్‌ప్లాంట్ భావితరాల యువతకు ఉపాధి కల్పించే కల్పవృక్షం వంటిదని అగనంపూడి సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ సభ్యులు అన్నారు. అటువంటి ప్లాంట్‌ను ప్రభుత్వరంగ సంస్థగానే నడపాలని డిమాండ్ చేశారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలిలో చేపడుతున్న రిలే నిరాహార దీక్షలు శనివారానికి 1094వ రోజుకు చేరుకున్నాయి. దీక్షల్లో అగనంపూడి సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ అధ్యక్షులు జి.బోసుబాబు, సభ్యులు, స్టీల్‌ప్లాంట్ రిటైర్డ్ ఉద్యోగులు, పలువురు కార్మికులు పాల్గొన్నారు. దీక్షా శిబిరాన్ని ఉద్దేశించి పోరాట కమిటీ నాయకులు మాట్లాడుతూ కేంద్రం ప్రభుత్వరంగ సంస్థలను అమ్ముకుంటూ పోతే భారతదేశంలో ఏ ప్రభుత్వరంగ సంస్థా మిగలదన్నారు. భావితరాలకు మంచి భవిష్యత్తును అందించేందుకు స్టీల్‌ప్లాంట్ వంటి సంస్థలను కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. కార్యక్రమంలో ట్రేడ్ యూనియన్ నాయకులు ఆదినారాయణ, ఎన్.రామారావు, జె.అయోధ్యరామ్, బలిరెడ్డి సత్యనారాయణ, అసోసియేషన్ ప్రతినిధులు ఎస్.ఎం.రఫీ, భాస్కరరాజు, గుదే సుశీల గజేంద్రరావు, మరిసా రామచంద్రరావు, విందుల వరహాలు, సీహెచ్ నారాయణరావు, సాయిన సన్యాసిరావు, బి.ఎస్.రాజు, మస్తాన్‌రెడ్డి, కాళిదాస్ తదితరులు పాల్గొన్నారు.

## ఉచిత శిక్షణ, ఉద్యోగ అవకాశాలు

అక్కిరెడ్డిపాలెం: హెచ్‌పీసీఎల్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న స్కిల్ డెవలప్‌మెంట్ ఇన్‌స్టిట్యూట్, బొల్లినేని మెడ్ స్కిల్స్ సంయుక్తంగా బ్యుటీషియన్, ఫుడ్ అండ్ బెవరేజ్ సర్వీస్ అసోసియేట్ కోర్సుల్లో ఉచిత శిక్షణ ఇచ్చి ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్నట్లు బొల్లినేని మెడ్ స్కిల్స్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సీహెచ్.నాగేశ్వరరావు శనివారం తెలిపారు. ఈ కోర్సుల్లో చేరేందుకు పదో తరగతి/ఇంటర్ పూర్తి చేసిన 18 నుంచి 28 ఏళ్ల లోపు వయసు గల పురుషులు, మహిళలు అర్హులని తెలియజేశారు. మూడు నెలల శిక్షణ అనంతరం ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామన్నారు. ఆసక్తి గలవారు 91219 99624, 79930 11605 నంబర్లను సంప్రదించి, పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. పూర్తి వివరాలకు విశాఖపట్నం ద్వారకానగర్‌లోని ఆర్టీసీ కాంప్లెక్స్‌లో హెచ్‌పీసీఎల్ స్కిల్ డెవలప్‌మెంట్ ఇన్‌స్టిట్యూట్‌లో సంప్రదించాలని తెలియజేశారు.

## అప్పన్న అన్నప్రసాద పథకానికి రూ.2.1 లక్షల విరాళం



దాతకు బాండ్ అందజేస్తున్న పీఆర్వో అప్పలనాయుడు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీ నృసింహస్వామి శాశ్వత అన్నప్రసాద పథకానికి నగరంలోని రామ్‌నగర్ ప్రాంతానికి చెందిన కె.సంకేత, శ్రావ్య రూ.1,00,116 విరాళం, శ్రీకాకుళం జిల్లా జి.సిగడాం మండలం గేదెలపేటకి చెందిన గేదెల రాజేష్ దంపతులు రూ.1,10,000 విరాళం శనివారం అందజేశారు. సంబంధిత విరాళాలను సింహగిరిపై ఉన్న పీఆర్వో కార్యాలయం వద్ద నగదు రూపంలో అందజేశారు. దేవస్థానం తరఫున దాతలకు బాండ్‌లను పీఆర్వో అప్పలనాయుడు అందజేశారు. అనంతరం దాతలకు స్వామివారి దర్శనం కల్పించి ప్రసాదం, శేషవస్త్రం అందజేశారు.

## నేత్రపర్వం.. నృసింహుని నిత్య కల్యాణం



కంకణధారణ ఘట్టాన్ని నిర్వహిస్తున్న అర్చకులు

సింహాచలం: సింహగిరిపై శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి నిత్యకల్యాణం శనివారం వైభవంగా జరిగింది. ఆలయ కల్యాణమండపంలో వేదికపై ఉదయం 9.30గంటలకు ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి,భూదేవిలను కొలువుదీర్చి ఈ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. విష్వక్సేన పూజ, పుణ్యాహవాచనం, కంకణధారణ, సంకల్పం, యజ్ఞోపవీతం, జీలకర్ర బెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు ఘట్టాలతో కల్యాణాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఉభయదాతలకు అక్షింతలు, ప్రసాదం, శేషవస్త్రాలను అందజేశారు.

## 12న ఏపీ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయీస్ యూనియన్ వార్షికోత్సవం

దాబాగార్డెన్స్ : ఆంధ్రప్రదేశ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయీస్ యూనియన్(1104 యూనియన్) 74 వార్షికోత్సవం ఈ నెల 12న నిర్వహించనున్నట్టు యూనియన్ ప్రతినిధి గణపతి ఒక ప్రకటనలో తెలిపారు. వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని ఆ రోజు ఉదయం 9 గంటలకు యూనియన్ కార్యాలయం వద్ద పతాకావిష్కరణతో కార్యక్రమాలు ప్రారంభం కానున్నట్టు వెల్లడించారు. ఈ సందర్భాన్ని పురస్కరించుకుని ఆ రోజు ఉదయం 9.30 గంటల నుంచి నగరంలోని హోటల్ గ్రీన్ పార్క్ ఎదురుగా గల విద్యుత్ శాఖ భవన్‌లో గల విద్యుత్ కళాభారతి ఆడిటోరియంలో ఏఎస్ రాజా బ్లడ్ బ్యాంక్‌చే పెద్ద ఎత్తున రక్తదాన శిబిరం ఏర్పాటు చేసినట్టు చెప్పారు. ఉదయం 10 గంటల నుంచి మెడికవర్ ఆస్పత్రి, గాదం డెంటల్ ఆస్పత్రి, అగర్వాల్ నేత్ర వైద్య బృందంచే వైద్య శిబిరం కూడా ఏర్పాటు చేసినట్టు చెప్పారు. సభ్యులందరికీ సాధారణ పరీక్షలతో పాటు గుండె, ఎముకల వైద్యుల సూచనపై అవసరమైన ఖరీదైన పరీక్షలు కూడా ఉచితంగానే ప్రముఖ వైద్య నిపుణులతో నిర్వహించనున్నట్టు చెప్పారు. మధ్యాహ్నం 2 గంటలకు ప్రముఖ క్యాన్సర్ నిపుణులచే అవగాహన సదస్సుతో పాటు మధ్యాహ్నం 12 గంటలకు ప్రేమసమాజం అనాథలు, దివ్యాంగులు, వృద్ధులకు అన్నసమారాధన, సాయంత్రం 6.30 గంటలకు పోలీస్ బ్యారెక్స్‌లో గల పాపాహోమ్ పిల్లలకు అన్నసమారాధన ఏర్పాటు చేసినట్టు గణపతి తెలిపారు.

## రైల్వేస్టేషన్‌లో 14 కిలోల గంజాయి సీజ్



గంజాయి నిందితుడితో ఆర్పీఎఫ్ సిబ్బంది

తాటిచెట్లపాలెం: విశాఖపట్నం రైల్వేస్టేషన్లో శనివారం అక్రమంగా గంజాయి రవాణా చేస్తున్న ఓ వ్యక్తిని రైల్వే భద్రతా దళం సిబ్బంది అదుపులోకి తీసుకున్నారు. 14 కిలోల గంజాయిని సీజ్ చేసి, అతడిని గవర్నమెంట్ రైల్వే పోలీసులకు అప్పగించారు. ఆర్పీఎఫ్ సిబ్బంది తెలిపిన వివరాలిలా.. ఆర్పీఎఫ్ సీనియర్ డివిజనల్ సెక్యూరిటీ కమిషనర్ సిహెచ్.రఘువీర్ ఆదేశాలతో ఆర్పీఎఫ్ ఇన్‌స్పెక్టర్ కె.రామకృష్ణ ఆధ్వర్యంలో ఏఎస్‌ఐ కె.అనంతరావు, సిబ్బందితో కలిసి శనివారం విశాఖ రైల్వేస్టేషన్‌లోని వివిధ ప్లాట్‌ఫాంల్లో తనిఖీలు చేస్తుండగా.. గుజరాత్‌కు చెందిన భవేష్ కిషోర్ భాయ్ పండ్యా అనే వ్యక్తి వద్ద అక్రమంగా రవాణా చేసేందుకు సిద్ధంగా ఉన్న 14 కేజీల గంజాయిని గుర్తించారు. వెంటనే అతడిని అదుపులోకి తీసుకుని, గంజాయిని సీజ్ చేసి, రిమాండ్ నిమిత్తం జీఆర్పీ సిబ్బందికి అప్పగించినట్లు ఏఎస్‌ఐ అనంతరావు తెలిపారు.

## గుర్తు తెలియని వ్యక్తి మృతి



వ్యక్తి మృతదేహం

తాటిచెట్లపాలెం: విశాఖపట్నం రైల్వేస్టేషన్‌లోని ప్లాట్‌ఫాం నంబర్ 1లో శనివారం గుర్తు తెలియని ఒక వ్యక్తి ఫిట్స్ వచ్చి పడిపోయాడు. ఇతడిని 108 అంబులెన్స్‌లో కేజీహెచ్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మరణించాడు. జీఆర్పీ ఇన్‌స్పెక్టర్ ఆదేశాలతో ఎస్‌ఐ మధుసూదనరావు కేసు నమోదు చేశారు. మృతుడి వయసు సుమారు 40 ఏళ్లు ఉంటుందని, ఇతడి వద్ద ఏ విధమైన ఆధారాలు లేవని, ఈ వ్యక్తి గురించి ఎవరికైనా తెలిస్తే విశాఖ రైల్వేస్టేషన్‌లోని గవర్నమెంట్ రైల్వే పోలీసులకు స్వయంగా గానీ లేదా 94406 27547, 94934 74582 నంబర్లలో గానీ తెలియజేయాలని జీఆర్పీ ఎస్‌ఐ కోరారు.

## రెండు చోట్ల దొంగతనాలు

- ల్యాప్‌టాప్, రూ.90 వేల నగదు, 2 తులాల నల్లపూసల తాడు చోరీ

సీతమ్మధార: ద్వారకా పోలీస్ స్టేషన్ పరిధిలో రెండు చోట్ల శనివారం దొంగతనాలు జరిగాయి. వివరాలిలా.. సీతంపేట దుర్గాగణపతి ఆలయం వెనుక రోడ్డులోని ఒక రూమ్‌లో కె.పవన్, వై.శ్రీనివాసరావు, ఎస్.సాయిదుర్గా, మణికంఠ అనే యువకులు అద్దెకు ఉంటున్నారు. వారు ఓ ప్రైవేట్ సంస్థలో ఉద్యోగం చేస్తున్నారు. రోజులాగే శనివారం గది తాళాన్ని తలుపు పక్కన మేకుకు తగిలించి విధులకు వెళ్లిపోయారు. తిరిగి సాయంత్రం వచ్చి చూడగా.. గది తలుపులు తీసి ఉండటాన్ని గమనించారు. రూమ్‌లో లాప్‌టాప్, ట్యాబ్, రూ.90 వేల నగదు దొంగిలించారని గుర్తించి ద్వారకా క్రైం పోలీసులకు ఫిర్యాదు చేశారు.

**ఇంటి తాళాలు పగలగొట్టి..:** మధురానగర్‌లోని గ్రూప్ హౌస్‌లో ఎస్.వరలక్ష్మి కుటుంబంతో కలిసి నివసిస్తోంది. శనివారం ఇంటికి తాళం వేసి సచివాలయానికి వెళ్లారు. తిరిగి సాయంత్రం వచ్చి చూడగా.. తలుపు తాళం పగలగొట్టి ఉండటాన్ని గమనించి దొంగతనం జరిగిందని గ్రహించారు. ఇంటి లోపల బీరువాలో ఉన్న సామగ్రి, దుస్తులు చిందరవందరగా పడి ఉన్నాయి. లాకర్‌లో రెండు తులాల బంగారు నల్లపూసల తాడు కనిపించకపోవడంతో ద్వారకా పోలీసులకు వరలక్ష్మి ఫిర్యాదు చేశారు. సంఘటనా స్థలానికి క్రైం డీసీపీ, ఏడీసీపీ, ఇతర పోలీస్ అధికారులు చేరుకుని పరిశీలించారు. ప్రస్తుతం సీసీ ఫుటేజీలను పరిశీలిస్తున్నారు. ఈ చోరీలకు సంబంధించి పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

## మీడియాకు సామాజిక బాధ్యత పెరగాలి



మాట్లాడుతున్న రచయిత, ఏపీ జర్నలిజం కళాశాల డైరెక్టర్ సతీష్ చందర్

సీతంపేట: వాస్తవాలకు అద్దం పట్టేలా మీడియాకు సామాజిక బాధ్యత పెరగాలని రచయిత, ఏపీ జర్నలిజం కళాశాల డైరెక్టర్ సతీష్ చందర్ అన్నారు. దళితుల బతుకులు, వారి జీవితాలు పత్రికల్లో కనిపించాలన్నారు. డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ స్థాపించిన మూక్‌నాయక్ పత్రికకు 104 ఏళ్లు పూర్తయిన సందర్భంగా శనివారం రామాటాకీస్ రోడ్డులోని అంబేడ్కర్ భవన్‌లో అంబేడ్కర్ మెమోరియల్ సొసైటీ ఆధ్వర్యంలో «మీడియా - సామాజిక న్యాయం» అనే అంశంపై నిర్వహించిన సదస్సులో ముఖ్య అతిథిగా ఆయన ప్రసంగించారు. స్వాతంత్య్ర పోరాటంలో భాగంగా దళితులను చైతన్యవంతులను చేసేందుకు అంబేడ్కర్ మూక్‌నాయక్ పత్రికను స్థాపించారన్నారు. దేశంలో తొలి పాత్రికేయుడు అంబేడ్కర్ అని అన్నారు. ఆయన సాధించిన విజయాలను నాటి పత్రికలు పరాజయాలుగా చూపించాయని చెప్పారు. దేశ వ్యాప్తంగా అనేక అకృత్యాలు ప్రస్తుతం మీడియాలో కానరావడం లేదన్నారు. అగ్రవర్ణాల చేతుల్లో ఉన్న కొన్ని పత్రికలు పార్టీలకు కొమ్ము కాస్తూ వారిని రాజకీయంగా ప్రోత్సహిస్తున్నాయన్నారు. అణగారిన వర్గాలకు కూడా మాధ్యమాలు ఉండాలని సూచించారు. మతోన్మాద పార్టీలు దేశమంతా దేశభక్తి అంటే రామభక్తి అని ప్రచారం చేస్తున్నాయన్నారు. ప్రధాన మీడియా ఇదే చూపిస్తోందని విమర్శించారు. కార్యక్రమంలో సీనియర్ పాత్రికేయుడు వి.వి.రమణమూర్తి, సొసైటీ అధ్యక్షుడు బొడ్డు కల్యాణరావు, ప్రధాన కార్యదర్శి జె.వి.ప్రభాకర్, సీనియర్ జర్నలిస్ట్ జి.కె.డి.ప్రసాద్, ఏయూ ప్రొఫెసర్ పి.డి.సత్యపాల్, డాక్టర్ ప్రసాద్, ప్రొఫెసర్ ప్రజ్ఞ పాల్గొన్నారు.

## న్యూపోర్టు పీఎస్‌ను సందర్శించిన డీసీపీ-2



పోలీస్ స్టేషన్‌లో రికార్డులు పరిశీలిస్తున్న డీసీపీ-2 సత్యనారాయణ

పెదగంట్యాడ: శాంతి భద్రతలకు విఘాతం కలిగించేవారు ఎంతటి వారైనా ఉపేక్షించవద్దని డీసీపీ-2 ఎం.సత్యనారాయణ తెలిపారు. న్యూపోర్టు పోలీస్ స్టేషన్‌ను శనివారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా రికార్డులు పరిశీలించారు. పెండింగ్ కేసుల వివరాలు తెలుసుకున్నారు. విధి నిర్వహణలో ఎవరూ నిర్లక్ష్యంగా వ్యవహరించవద్దని, పోలీసు స్టేషన్‌కు వచ్చేవారితో స్నేహపూర్వకంగా మెలగాలని సూచించారు. ఫ్రెండ్లీ పోలీసింగ్‌ను పాటించాలన్నారు. ఈ విషయంలో సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే సహించేది లేదన్నారు.

## రైలు కిందపడి గుర్తు తెలియని వ్యక్తి ఆత్మహత్య

అగనంపూడి: దువ్వాడ రైల్వే స్టేషన్‌కు సమీపంలో గుర్తు తెలియని వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డారు. విజయవాడ నుంచి విశాఖ వైపు వెళ్లే ట్రాక్‌పై ఈ సంఘటన చోటు చేసుకుంది. దువ్వాడ జీఆర్‌పీ హెడ్ కానిస్టేబుల్ రమేష్ తెలిపిన వివరాల ప్రకారం.. అగనంపూడి ఫ్లై ఓవర్ వంతెనకు సమీపంలో డొంకాడ కాలనీకి ఎదురుగా ఉన్న రైల్వే ట్రాక్‌పై సుమారు 35 సంవత్సరాల వయసు ఉన్న వ్యక్తి మృతదేహాన్ని స్థానికులు గుర్తించి, దువ్వాడ జీఆర్‌పీ ఔట్ పోస్ట్‌కు సమాచారం అందించారు. వెంటనే వారు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. తల, మొండెం వేరుగా ఉండడంతో ఆత్మహత్యకు పాల్పడినట్టు నిర్ధారించినట్టు తెలియజేశారు. శనివారం తెల్లవారుజామున గుర్తు తెలియని వ్యక్తి రైలు కింద పడి మృతి చెంది ఉంటారని తెలిపారు. మృతదేహంపై ఆకుపచ్చ రంగు టీ షర్ట్, నీలంరంగు ఫుల్ ట్రాక్ ఉంది. మృతుని వివరాల కోసం 9491782534 నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

## బహిరంగ సభ విజయవంతం చేయాలి

సీతంపేట: బీసీ చైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు వీరవల్లి శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఈ నెల 11వ తేదీ ఆదివారం మధ్యాహ్నం 3 గంటలకు పెద తాడేపల్లి హైవే పక్కన తాడేపల్లి గూడెంలో జరగనున్న బీసీ బహిరంగ సభను జయప్రదం చేయాలని రాష్ట్ర కన్వీనర్ కట్టా మల్లేశ్వరరావు పిలుపునిచ్చారు. సీతంపేటలో శనివారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ బీసీ హక్కుల సాధనకు జరుగుతున్న ఈ సభలో బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలు అధిక సంఖ్యలో పాల్గొవాలని కోరారు. బీసీలంతా ఒకతాటిపైకి వచ్చి రాజ్యాధికారాన్ని కైవసం చేసుకునే దిశగా పయనించాలన్నారు. చట్ట సభల్లో బీసీలకు రిజర్వేషన్లు, మహిళా రిజర్వేషన్ బిల్లులో మహిళలకు సబ్ కోటా, బీసీ ఉద్యోగులకు ప్రమోషన్లలో రిజర్వేషన్లు, బీసీ సబ్ ప్లాన్, స్థానిక సంస్థల్లో బీసీ రిజర్వేషన్ల డిమాండ్ల సాధనకు బీసీలంతా సమష్టిగా కదలివచ్చి మన శక్తిని చాటాలన్నారు.